నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

అనంతపురం | శ్రీ సత్యసాయి

శనివారం | 25 మే 2024 | పేజీలు 9


హంస వాహనంపై
# ఊరేగిన నారసింహుడు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత నరసింహ స్వామి

**ఉరవకొండ, మేజర్ న్యూస్:** పెన్నహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బహుళ పాద్యమి శుక్రవారం శ్రీవారు హంస వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధికారి కె. విజయ్ కుమార్ ఆదేశాల మేరకు ప్రధాన అర్చకులు ద్వారకానాథ్ చార్యుల పర్యవేక్షణలో వేకువ జామునే స్వామివారికి పూజా కైంకర్యాలు శాస్త్రోక్తంగా జరిపారు. అర్చకులు మయూరం బాలాజీ చార్యులు స్వామివారికి మహాభిషేకం, సుగంధ పుష్పాల

మిగతా 4లో



ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి మూల విరాట్

రథోత్సవం సజావుగా
# జరిగేలా చర్యలు చేపట్టండి

ఉరవకొండ తహసిల్దార్ శ్రీనివాసులు

**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నో హోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కనీస మౌలిక వసతులు కల్పించి, ఉత్సవాలు సజావుగా జరిగే విధంగా అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకొని విధులు నిర్వహించాలని ఉరవకొండ తహసిల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ శ్రీనివాసులు ఆలయ అధికారి కె. విజయ్ కుమార్ తో కలిసి అన్ని శాఖల అధికారులతో మే 28న జరగనున్న పెన్నహోబిలం రథోత్సవ ఏర్పాట్ల నిర్వహణ పట్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సంబంధిత అధికారులకు సలహాలు సూచనలు ఇచ్చారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని వేలాదిగా భక్తులు తరలివస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన

02




ఆసుపత్రిలో కర్ర పెత్తనంపై
# చలనం



## పెద్ద ఎత్తున తరలివస్తున్న బాధితులు

**ఆయన ఇష్టానుసారం వ్యవహారంపై తీవ్ర విమర్శలు**

**కర్ర పెత్తనాన్ని తగ్గించాలంటూ డిమాండ్**

**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్**

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కర్ర పెత్తనం అధికారి బాధితులు ఒక్కొక్కరిగా పెద్ద ఎత్తున సూర్య కథనానికి స్పందించారు. ఆయన ఇష్టానుసారం వ్యవహారంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. కార్యాలయంలో ఉండకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ తమపై కర్ర పెత్తనం చేయడంపై ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి తమపై ఇష్టానుసారంగా పెత్తనం చలాయిస్తుండడం పై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఆసుపత్రి గౌరవం పూర్తిగా మంట కలిసి పోతున్న నేపథ్యంలో ఇలాంటి అధికారుల వ్యవహారంపై తగిన చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులను సైతం తాము కలిసేందుకు సిద్ధంగా ఉన్నామంటూ వారు తెలియజేస్తున్నారు. ఆసుపత్రి వ్యవహారం గత కొన్ని రోజులుగా ఇష్టం వచ్చినట్లు జరుగుతోందని దీంతో ఆసుపత్రిలో వైద్యం కంటే రాజకీయ చర్చలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ తీవ్ర దుమారం రేగుతోందని వారు వాపోతున్నారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పరిధిలో జరుగుతున్న అనేక అంశాలను ఆధారంగా చేసుకుని ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆసుపత్రిలో పర్సంటేజీ వ్యవహారం తీవ్ర దుమారం రేగింది. ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్న వైనంపై ఉద్యోగ సంఘాలు సైతం తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఇటీవల చోటు చేసుకున్న అనేక కార్యకలాపాలు లో ఆయన హస్తంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఆసుపత్రికి పెద్ద దిక్కుగా వ్యవహరించాల్సిన ఉన్నతాధికారి ఇలాంటి తప్పుడు వ్యవహారాలు చేయడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

02



ఓట్ల లెక్కింపు
# అత్యంత కీలకం..

**సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు**

**జిల్లా ఎన్నికల అధికారి అరుణ్ బాబు**

**పుట్టపర్తి మేజర్ న్యూస్:** ఎన్నికల ప్రక్రియలో భాగంగా చేపట్టే ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని, ప్రతీఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఈ ప్రక్రియను పకడ్బంధీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారులు, సహా రిటర్నింగ్ అధికారులు, అదనపు సహాయ రిటర్నింగ్ అధికారులతో తొలివిడత అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వివిధ దశలు, పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని, సొంత నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. చిన్న పొరపాటుకు కూడా తావివ్వద్దని, ప్రతీఒక్కరూ ఎంతో అప్రమత్తంగా ఉండి తమకు కేటాయించిన విధులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియపై అందరూ సమగ్ర అవగాహన కల్పించుకోవాలని ఈ శిక్షణ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మిగతా 3లో



నగరంలో
# పోలీసుల కవాతు

**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పీ గౌతమి శాలి ఆదేశాలతో అనంతపురం ఒన్ టౌన్ , 4వ టౌన్ పోలీసుసు స్టేషన్ పరిధిలో కేంద్ర సాయుధ బలగాలచే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రధాన రహదారులు, కూడళ్లతో పాటు సమస్యాత్మక ప్రాంతాలలో కవాతు కొనసాగింది. ఏవైనా సమస్యలుంటే ఆయా స్థానిక పోలీసుల దృష్టికి తీసికెళ్లి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. గొడవలు, అల్లర్లు జోలికెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచనలు చేశారు.

**ఫ్లాగ్ మార్చ్ కొనసాగిన ప్రాంతాలు :**

జిల్లా కేంద్రంలోని నారాయణపురం, తపోవనం, సంగమేశ్వర సర్కిల్, బసవన్నకట్ట, పాతవూరు, వేణుగోపాల్ నగర్,

మిగతా 03

వేరుశనగ విత్తన
# పంపిణీ ప్రారంభం

**నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలి**

**విత్తన పంపిణీ కేంద్రంలో స్లాట్ పద్ధతిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేయాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**



**డి హీరేహాల్, మేజర్ న్యూస్ :** నాణ్యమైన వేరుశనగ విత్తనాలను రైతులకు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి (ఐఏఎస్) ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం గుమ్మగట్ట మండల కేంద్రంలోని వ్యవసాయ గోదాము వద్ద వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 0 – 0.5 ఎకరాలు ఉన్న రైతుకు 30 కేజీల బ్యాగ్ ఒకటి, 0.5– 1.0 ఎకరాలు ఉన్న రైతుకి 30 కేజీల బ్యాగులు రెండు, 1.01 ఎకరాల పైనున్న వారికి 30 కేజీల వేరుశనగ విత్తనాల బ్యాగులు 3 పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రైతుకు విత్తన పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వేరుశనగ విత్తనాలను పంపిణీ కేంద్రంలో స్లాట్ పద్ధతిలో రైతులకు పంపిణీ చేయాలని, దీని ద్వారా విత్తన పంపిణీ కేంద్రంలో హడావిడి ఉండదన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా విత్తనాల పేమెంట్ చేయాలన్నారు. రైతులకు ఎక్కువ విత్తనం అవసరం ఉంది అని ముందుగా చెబితే

03

### నేడు పాలిసెట్ 2024 వెబ్ కౌన్సిలింగ్ పై

# ఉచిత అవగాహన సదస్సు

**అనంతపురం విద్య మేజర్ న్యూస్** : అనంతపురం రుద్రంపేట పీవికెకె ఐటి డిప్లమా కళాశాలలో పాలిసెట్ 2024 వెబ్ కౌన్సిలింగ్ పై ఉచిత అవగాహన సదస్సు శనివారం ఉదయం 9-30 గంటలకు నిష్ణాతులైన పాలిటెక్నిక్ ప్రొఫెసర్లచే మీ ధ్రువ పత్రాల పరిశీలన, వెబ్ కౌన్సిలింగ్ లోని సమస్యలపైన, కంప్యూటర్ లో మీకు నచ్చిన కళాశాలలో నచ్చిన బ్రాంచ్ ఎన్నుకోవడంపై, కౌన్సిలింగ్ విధానం గురించి సవివరంగా వివరించబడుతుం దన్నారు. కావున పాలిసెట్ 2024లో అర్హత సాధించిన విద్యార్థిని, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పివికెకె ఐటి డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ డా జి.యన్.యస్ వైభవ్ తెలియచేసారు. ఈ సదస్సు నిమిత్తమై అనంతపురము ఆర్.టి.సి బస్టాండ్ నుండి ఉదయం 9- 00 గంటలకు ఉచిత కాలేజీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని ఇతర వివరాలకు 9848471460, 8886621124 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# హింసకు పాల్పడితే కఠిన చర్యలు

### ఇప్పటివరకు 170 మంది బైండోవర్ : ఎస్సై శివ



**బెలుగుప్ప మేజర్ న్యూస్** : ఎవరైనా హింసకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 170 మందిని బైండోవర్ చేయడం జరిగిందని ఎస్ఐ శివ తెలిపారు అనంతరం మాట్లాడుతూ కౌంటింగ్ జరిగే రోజు అలాగే దానికి ముందుగాని ,తర్వాత గాని గ్రామాల్లో గొడవలు జరగకూడదనే ఉద్దేశంతో ముందు జాగ్రత్త చర్యలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలక్షన్ జరిగినప్పుడు నుండి ఇప్పటివరకు అన్ని పార్టీలకు చెందిన సుమారు 170 మందిని బైండోవర్ చేయించడం జరిగిందని ఈ బైండోవర్ ప్రక్రియ జూన్ 4వ తేదీ వరకు కొనసాగుతూ ఉంటుందన్నారు అలాగే గ్రామాలలో అల్లర్లు/గొడవలు సృష్టించడానికి ఎవరైనా ప్రయత్నిస్తే నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని,వారు ఎంతటి వారైనా సరే వదలే ప్రసక్తే లేదని గట్టిగా బుద్ధి చెబుతామని అవసరమైతే వారి పైన రౌడీషీట్ ఓపెన్ చేయుటకు లేదా జిల్లా బహిష్కరణ చేయడానికి కూడా వెనకాడబోము అన్నారు ఇప్పటికే గంగవరం గ్రామానికి చెందిన వ్యక్తిని జిల్లా బహిష్కరణ చేయడం జరిగిందని తెలిపారు ప్రస్తుతం సెక్షన్ 144 సీఆర్పిసి మరియు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంది అలాగే ఎలక్షన్ కోడ్ కూడా ఇంకా అమలులో ఉన్న కారణంగా ప్రజలు గ్రామాలలో అనవసరంగా గుంపులు గుంపులుగా ఉండుటకు వీలు లేదన్నారు మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పెట్రోల్ బంక్ యజమానులకు తమ యొక్క కస్టమర్లకు లూజుగా పెట్రోల్, డీజిల్ అమ్మడం లేదా క్యాన్లు కు పట్టడం వంటివి చేయరాదని అలా చేసిన యెడల చట్ట ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 6వ తేదీ వరకు బెలుగుప్ప పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలలో ఎవరు కూడ ఏలాంటి టపాసులు అమ్మ రాదు మరియు వినియోగించరాదని దీనిని అతిక్రమించిన ఎడల సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడునన్నారు కావున ప్రజలు ఈ విషయాలను అర్థం చేసుకుని పరిధిలోని అన్ని గ్రామాల్లో శాంతిభద్రతలు అదుపులో ఉండుటకు మరియు ఇప్పుడున్న ప్రశాంత వాతావరణ కొనసాగుటకు ప్రజలందరూ పోలీసులకు సహకరించవలెనని ఎస్ఐ శివ తెలిపారు.

# మంచి నీటి కోసం గొడవ... పలువురికి గాయాలు

**డి హీరేహాల్, మేజర్ న్యూస్ :**



మండల పరిధిలోని హెచ్ సిద్దాపురం తండాకు చెందిన రెండు కుటుంబ సభ్యులు మంచినీటి విషయంలో గొడవ పడగా ఇరువురి పై కేసు నమోదు చేయడం జరిగింది. రూపా బాయ్ నిర్వహిస్తున్న మినరల్ ట్యాంక్ వద్ద కు దేవి బాయ్ మంచినీళ్లు పట్టుకోవడానికి పోగా మంచినీళ్లు అయిపోయియని చెప్పడంతో ఒకరికొకరు వాదులాడుకొని శివ నాయక్ కుటుంబ సభ్యులు మరియు చంద్ర నాయక్ కుటుంబ సభ్యులు చేతులు, కాళ్ళ తో కొట్టుకోగా గాయాలు అయ్యాయి. ఈ గొడవలో ఒకరికి రక్తగాయము మిగిలిన 5 మందికి మూగ గాయాలు కలిగినాయి. ఇరువురు ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు. గవిసిద్ధ నాయక్, సుశీలబాయ్, దేవి బాయ్ గాయాలు పడ్డ వారిలో కలరు.





### రైతులకు నాణ్యమైన

# విత్తన వేరుశనగ పంపిణీ..

**గార్లదిన్నె మేజర్ న్యూస్** : మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవటంతో రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగను పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయ అనంతపురం వ్యవసాయ సంచకులు ఎం రవి మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ శుక్రవారం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సంచకులు రవి మట్లాడుతూ... గ్రామాలలో వేరుశనగ విత్తనాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేయడం రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నేరుగా రైతు చేతికి విత్తన వేరుశెనగను పంపిణీ చేస్తామన్నారు. మండల వ్యాప్తంగా వ్యవసాయ సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ రైతులకు సేవల అందించాలన్నారు. రైతులకు కావలసిన ఎరువులు అందుబాటులో ఉండేలా క్షేత్రస్థాయిలో రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. అందులో భాగంగా మండల కేంద్రంలోని స్థానిక రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం విత్తన వేరుశెనగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 1400 క్వింటాళ్లు విత్తన వేరుసెనగ ఆయా గ్రామాలలో ఉన్న రైతు భరోసా కేంద్రాలకు చేరిందని ఇప్పటివరకు విత్తన వేరుశెనగ కోసం 972మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు .ప్రతి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం పంపిణీ కార్యక్రమం ప్రారంభించామని ప్రతి గ్రామంలో ఉన్న రైతులు విత్తన వేరుశనగను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో స్రవంతి వీహెచ్ఎలు రైతులు పాల్గొన్నారు

## అర్చకులలకు నిత్యవసరాల పంపిణీ



**అనంతపురం విద్య మేజర్ న్యూస్** : నిత్యసురభి చారిట బుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం నిర్వాహకులు పురుషోత్తమ మురళీకృష్ణ, నిర్మలమురళి చేతుల మీదుగా అర్చకులకు నిత్యవసరాలు పంపిణీ చేశారు. శుక్రవారం వైశాఖ బహుళ పాడ్యమి సందర్భంగా రూ. 16 వేల ఖర్చుతో 11 మంది అర్చకులకు స్వయంపాకం తాంబూల దక్షిణ నిత్యవసరాల పంపిణీ కార్యక్ర మాన్ని ఆదర్శనగర్ లోని పుట్టినిల్లు ఆశ్రమంలో ట్రస్టు సభ్యులందరి సహకారంతో చేపట్టారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడు తూ.. వైష్ణవి శ్రేయష్ పెళ్లిరోజు సందర్భంగా ట్రస్ట్ తరపున ఆశీర్వదిస్తూ పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వైశాఖ మాసంలో వైశాఖ పురాణం పారాయణం, గుడికి వెళితే ఎంత పుణ్యం వస్తుందో అలాగే అర్చకులకు గొడుగులు, పాదరక్షలు, నూతన వస్త్రాలు, నిత్యవసరాలు, ధనం ఎవరికి తోచినది వారు చేస్తే మెండుగా పుణ్యం వస్తుందని తెలియజేశారు. ఆలయానికి, హెూమాలకు వెళితే ప్రజల సుఖ సంతోషాలు కోరుకునే అర్చకులకు బాధ్యతగా నిత్యవసరాలు అందించామన్నారు. అర్చకులు వేద పండితుల వేదమంత్రాలే మానవ జీవన విధానాలకు సహకరిస్తా యన్నారు. వీలున్న ప్రతి ఒక్కరు అర్చకులకు బాధ్యతగా తమ వంతు సేవ చేయడానికి కృషి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సౌదామణి, లక్ష్మీనారాయణ, అర్చక స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో కర్ర పెత్తనంపై చలనం

▸▸ మొదటి పేజీ తరువాయి

ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో తన వాటా కోసం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. సూర్య కథనంతో ఆయన బాధితులు పెద్ద ఎత్తున ఒక్కటై ఆయన వ్యవహారంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఆసుపత్రిలో జరిగే ఏ పనికైనా తన ప్రమేయం లేకుండా చేయరాదని హుకుం వేయడంపై తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఆసుపత్రి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన అధికారి ఇలా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న తీరుపై తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇలాంటి అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని పలు ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రశాంతంగా పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

**ఉరవకొండ, మేజర్ న్యూస్**: పట్టణంలో ఏడు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు మొదటి రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాశాఖ అధికారి హెచ్ . ఈశ్వరప్ప తెలిపారు. 767 మంది విద్యార్థులకు గాను 340 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. 427 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద తాగునీటి వసతి, ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ ఈశ్వరప్ప తెలిపారు.



## బెలుగుప్ప మండలంలో వేరుశెనగ విత్తన పంపిణీ ప్రారంభం: ఏవో పృథ్వి సాగర్

**బెలుగుప్ప మేజర్ న్యూస్** : బెలుగుప్ప మండలంలోని రైతు భరోసా కేంద్రాల నందు వేరుశనగ విత్తన పంపిణీ శుక్రవారం ప్రారంభమైందని ఏవో పృథ్వీ సాగర్ తెలిపారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 399 రైతులు వేరుశనగ విత్తనం కోసం రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకున్నారు. పేరు నమోదు చేసుకున్న రైతులకు క్రమ పద్ధతిలో శుక్రవారం నుండి వేరుశనగ విత్తన పంపిణీ చేయడం జరుగుతున్నది. వేరుశనగ విత్తనం కావాల్సిన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో పేర్లను నమోదు చేసుకుని వేరుశెనగ విత్తనాలను పొందవచ్చు అని మండల వ్యవసాయ అధికారి పృథ్వీ సాగర్ తెలిపారు.

# రథోత్సవం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టండి

▸▸ మొదటి పేజీ తరువాయి

కనీస మౌలిక వసతులు కల్పించే దిశగా అధికారులు సమన్వయంతో తమ విధులు నిర్వర్తించాలని సూచించారు. తాగునీటి వసతి, పారిశుద్ధ్యం, పార్కింగ్ వసతి, చలువ పందిళ్ళ ఏర్పాటు, ఉచిత వైద్య శిబిరం తదితర వసతులు కల్పించాలని తెలిపారు. మరమ్మత్తులతో సిద్ధంగా ఉంచిన రథాన్ని బి .టి రోడ్డుపై సజావుగా లాగేందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలకు రోడ్లు భవనాల అధికారులు ముందస్తు పర్యవేక్షణ అవసరమన్నారు. పోలీసులు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేసి ఉత్సవాల్లో ఎలాంటి అసాంఘిక ఘటనలు చోటు చేసుకోకుండా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. అగ్ని ప్రమాదం, విద్యుత్ ప్రమాద ఘటనల నివారణకు అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని బస్సు సర్వీసులను అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ అధికారులకు తెలిపారు. వేలాదిగా తరలి వచ్చే భక్తుల నుంచి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా స్వామి దర్శనార్థం ఆలయం వద్ద భారీ కేడ్ల నిర్వహణ, క్యూ లైన్ల ఏర్పాటుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని తహసిల్దార్ ఆలయ అధికారికి సూచించారు. పెన్నహెూబిలం బ్రహ్మోత్సవాల నిర్వహణలో ఎలాంటి అవరోధాలు చోటు చేసుకోకుండా సజావుగా జరిపించే బాధ్యత మనందరిపై ఉందని తహసిల్దార్ శ్రీనివాసులు అధికారులందరికీ మరోసారి గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాఘవేంద్రప్ప, మండల పరిషత్ ఏవో జయరాములు, అగ్నిమాపక అధికారి భీమలింగప్ప, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది కొల్లాయప్ప, ఆలయ సిబ్బంది మారుతి ప్రసాద్, దీపక్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పివికెకె ఇంజినీరింగ్ కళాశాలకు

# న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు...



**అనంతపురం విద్య మేజర్ న్యూస్ :** జిల్లాలో గత 16 సంవత్సరాలుగా ఎంతో మంది విద్యార్థులను అతున్నత ప్రమాణాలతో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్ కమిటీ ఏ గ్రేడ్ గుర్తింపును ఇచ్చింది. దేశంలోని ఉన్నత విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలను పెంపొందించడానికి యూ జీ సి న్యాక్ ను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా సెంట్రల్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ఛైర్మెన్ గా ఒక త్రిసభ్య కమిటీ పీవీకేకే కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కమిటీ నిపుణులు విద్యార్థులతో, బోధన, బోధనేతర సిబ్బందితో, పూర్వ విద్యార్థులతో, తల్లిదండ్రులతో, యాజమాన్యంతో సంభాషించి వీరందరి అభిప్రాయాలను పరిగణించి, అక్కడి విద్య, వసతులు, విద్యార్థుల ప్రతిభ పాఠ్య ప్రణాళిక రూపకల్పన, అమలు, విద్యా బోధన స్థాయి, పరిశోధన దిశగా పురోగతి, మౌలిక సదుపాయాలు, విద్యార్థి పురోగతి, కళాశాల విశ్వసనీయత, అత్యున్నత ప్రమాణాలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉన్నత విద్య అర్హతలు కలిగిన ఆచార్యుల నిష్పత్తి తదితర పలు అంశాలను పరిశీలించి పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలకు ఏ గ్రేడ్ కళాశాలగా గుర్తింపునిచ్చారు. ఈ కమిటీ కళాశాలలో విద్యార్థుల అభివృద్ధి కొరకు అవలంబిస్తున్న పీవీకేకే ఐటీ హానర్స్ సొసైటీ, విద్యార్థులలోని నాయకత్వ లక్షణాలను పెంపొందించే క్యాంపస్ రేడియో, ఐడియా క్లబ్ లను ప్రత్యేకంగా అభినందించి, 700 కు పైగా కంప్యూటర్స్, లైబ్రరీలో 43వేల పైచిలుకు వివిధ పుస్తకాలు, ప్రతి తరగతికి ఒక ప్రొజెక్టర్, విశాలవంతమైన తరగతి గదులు కలిగి పచ్చనిచెట్ల నడుమ సువిశాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ కళాశాల భవనాలను గమనించి అభినందించారు. గత 5సంవత్సరాలుగా పెరుగుతున్న ప్లేస్మెంట్స్, ఉత్తమ స్థాయి ప్రయోగశాలలు , క్రీడా ప్రాంగణాలు, వ్యాయమ శాలలు, మొదలగు సౌకర్యాలను చూసి ప్రశంసించారు.

కళాశాల చైర్మన్ డా.పల్లె కిషోర్ మట్లాడుతూ.. అతి త్వరలో పీవీకేకే ఐటీ అటానమస్ కళాశాల గా గుర్తింపు పొందుతోందని తెలియజేశారు.

# 11 ఏళ్ల బాలుడి కడుపులో మెలితిరిగిన పేగులు



**అనంతపురం జిల్లాలో తొలిసారిగా లాడ్స్ ప్రొసీజర్**

**పెద్దవయసు వారిలో 0.2 నుంచి 0.5% మాత్రమే వచ్చే అవకాశం**

**విజయవంతంగా శస్త్రచికిత్స చేసిన కిమ్స్ సవీరా వైద్యులు**

**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ :** కడపులో పేగులు మెలితిరిగిపోయి తీవ్రంగా ఇబ్బంది పడుతున్న ఓ బాలుడికి అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్యులు సమయానికి శస్త్రచికిత్స చేసి, ప్రాణాలు కాపాడారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ఎన్. మహ్మద్ షాహిద్ తెలిపారు.

“11 ఏళ్ల బాలుడు తరచు విపరీతమైన కడుపునొప్పి, తరచు వాంతులతో గత ఐదేళ్లుగా బాధపడుతున్నాడు. గత రెండు నెలలుగా ఇవి బాగా ఎక్కువయ్యాయి. ఇదే సమస్యతో పలు ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ప్రయోజనం కనిపించలేదు. దాంతో వాళ్లు కిమ్స్ సవీరా ఆస్పత్రికి వచ్చారు. ఇక్కడ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ఎన్. మహ్మద్ షాహిద్ నేతృత్వంలో ముందు క్షుణ్ణంగా పరిశీలించారు. సీటీ స్కాన్ కూడా చేయడంతో.. పేగులు మెలితిరిగినట్లు తెలిసింది. వెంటనే బాబు తల్లిదండ్రులకు విషయాన్ని వివరించి, శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించాం. ఇందుకు లాడ్స్ ప్రొసీజర్ అనే అత్యాధునిక విధానాన్ని అనుసరించాం. ఇలా చేయడం అనంతపురం జిల్లాలో ఇదే మొదటిసారి. ఆపరేషన్ తర్వాత బాబు పరిస్థితి మొత్తం బాగుపడింది. మొదటిరోజే ఆహారం తినిపించి, నడిపించి.. మూడోరోజు అన్నీ బాగుండటంతో డిశ్చార్జి చేశాం.

పేగులు మెలితిరగడం అనేది పుట్టుకతోనే వచ్చే సమస్య. దీనివల్ల కడుపులో అన్నీ అడ్డం పడతాయి. దీనివల్ల పలురకాల పేగుల సమస్యలు వస్తాయి. అవి దీర్ఘకాలం కూడా ఉంటాయి. వీటిని సరిగా గుర్తించి, సరైన సమయానికి చికిత్స అందించాలి. లేకపోతే తీవ్ర విపరిణామాలు సంభవిస్తాయి. ఇలా పేగులు మెలితిరిగే సమస్య ప్రతి 6 వేల మంది పిల్లల్లో ఒకరికి మాత్రమే వస్తుంది. ఇది మరి ఎక్కువగా అయిపోతే అప్పుడు బొవెల్ వాల్వులస్ అనే సమస్య వస్తుంది. సాధారణంగా పుట్టిన ఏడాదిలోపే పేగులు మెలితిరిగే సమస్యను గుర్తిస్తారు. మొదటి నెలలో గుర్తించే కేసులు 30%, ఒక ఏడాదిలోపు 60%, ఐదేళ్లలోపు వారికి గుర్తించే కేసులు 75% వరకు ఉంటాయి. ఇంకా పెద్ద అయిన తర్వాత అయితే కేవలం 0.2 నుంచి 0.5% మందికే ఈ సమస్య కనపడుతుంది. ఇలాంటివారిలో 15% మందికి మిడ్గట్ వాల్వులస్ అనే సమస్య వస్తుంది. అనంతపురం జిల్లాలో లాడ్స్ ప్రొసీజర్ చేడం ఇదే మొదటిసారి. కిమ్స్ సవీరా ఆస్పత్రిలో ఇందుకు సంబంధించిన సదుపాయాలన్నీ ఉన్నాయి. ఇక్కడ అన్నిరకాల మినిమల్లీ ఇన్వేజివ్ గ్యాస్ట్రో ఇంటస్టైనల్ సర్జరీలు చేస్తారు. ఓపెన్ సర్జరీలు చేయడంలో కూడా ఇక్కడి సర్జకిల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టులు పూర్తి నైపుణ్యం కలిగి ఉన్నారు. ఎంత సంక్లిష్టమైన సమస్యలకైనా ఇక్కడ పూర్తిస్థాయి చికిత్స అందించగలరు” అని డాక్టర్ ఎన్. మహ్మద్ షాహిద్ చెప్పారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో

# సీట్లు ఇప్పిస్తామని..



### విద్యార్థులను మోసం చేస్తున్న కన్సల్టెన్సీలు..

**ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జెఎన్టియు రిజిస్టర్ శశిధర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్ర కి వినతి**

**అనంతపురం విద్య మేజర్ న్యూస్ :** అనంతపురం నగరంలో కొన్ని కన్సల్టెన్సీ సెంటర్లు ఏర్పాటు చేసుకుని ఇంజనీరింగ్ పాలిటెక్నిక్, బి ఫార్మసీ, ఎం ఫార్మసీలో కోరుకున్న కళాశాలలో సీట్లు ఇప్పిస్తామని విద్యార్థుల సర్టిఫికెట్లు తీసుకొని డబ్బులు వసూలు చేస్తున్న కన్సల్టెన్సీ లపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం జేఎన్టీయూ రిజిస్టర్ శశిధర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్ర కి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ ఇంకా కౌన్సిలింగ్ ప్రారంభం కాకముందే కొన్ని కన్సల్టెన్సింగ్ సెంటర్లను ఏర్పాటు చేసుకొని విద్యార్థులకు వారి తల్లితండ్రులకు కాల్ చేసి వెయ్యి రూపాయలు చెల్లించి సర్టిఫికెట్లు ఇక్కడ అందజేసి వెళ్తే కౌన్సెలింగ్ లో మీరు ఏ కళాశాల అయితే కోరుకుంటారో ఆ కళాశాలలో సీటు ఇప్పిస్తామని కన్సల్టెన్సీ వారు విద్యార్థుల తల్లిదండ్రులకు తెలుపుతున్నారు. గతంలో కొంతమంది ఇలా కన్సల్టెన్సీ రూపంలో సర్టిఫికెట్లు విద్యార్థుల దగ్గర నుంచి తీసుకొని విద్యార్థులు కోరుకున్న కళాశాలలో సీటు రాలేదు ఈ కళాశాలలో సీటు వచ్చింది ఇక్కడికి వెళ్ళండి అని విద్యార్థులకు తెలియజేస్తున్నారు. ఇది కన్సల్టెన్సీ వారు కొన్ని ప్రైవేట్ కళాశాలతో టై అప్ అవుతూ ఒక అడ్మిషన్ కి ఇంత డబ్బులు తీసుకుంటూ విద్యార్థులకు ఇష్టం లేకపోయినా ఆ కళాశాలలో విద్యార్థుల సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. అప్పుడు విద్యార్థులు మాకు ఈ కళాశాలలో వద్దు సర్టిఫికెట్లు వెనక్కి ఇవ్వండి అని కళాశాల యాజమాన్యాన్ని అడిగితే కొన్ని 30000 రూపాయల కట్టండి లేదా 50,000 కట్టండి. అలా కడితేనే మీకు సర్టిఫికెట్లు వెనక్కి ఇస్తామని విద్యార్థులను డిమాండ్ చేస్తున్నారు. డబ్బులు చెల్లించకపోతే సర్టిఫికెట్లు వెనక్కి ఇవ్వమని కరాకండిగా తెలియజేస్తున్నారు. అప్పుడు కన్సల్టెన్సీ వారు విద్యార్థుల ఫోన్లు లిఫ్ట్ చేయకుండా ఉండడం జరిగిందన్నారు తక్షణమే విద్యార్థులను విద్యార్థుల తల్లితండ్రులను కన్సల్టెన్సీల పేరుతో మోసం చేస్తున్న కన్సల్టెన్సీల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. తక్షణమే కన్సల్టెన్సీలను మూసివేసి కన్సల్టెన్సీల దోపిడీ నుండి విద్యార్థులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు మంజునాథ్ ఉమామహేష్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ నగర నాయకులు సమీర్ రారాజు తదితరులు పాల్గొన్నారు.



## హంస వాహనంపై

# ఊరేగిన నారసింహుడు

▸▸ మొదటి పేజీ తరువాయి

అలంకరణ, విశేష అర్చనలు, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవముత్తులను అందంగా అలంకరించి పల్లకిపై కొలువు తీర్చారు. ఆలయము నుంచి బాజా భజంత్రీల నడుమ ఉత్సవ మూర్తులను ఊరేగింపు గా తీసుకెళ్లి హంస వాహనంపై ఉంచి ప్రత్యేక పూజలు జరిపారు. తదనంతరం స్వామివారిని మేళ తాళాలు మంగళ వాయిద్యాలు నడుమ ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. నరసింహుడు హంస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. హంస అంటే జ్ఞానానికి ప్రతీక గా పేర్కొంటారు. హంస లో ఉన్న ప్రత్యేక లక్షణం ఏమిటంటే నీళ్లను, పాలను వేరు చేసే స్వభావంతో ఇది ప్రత్యేకతగా నిలుస్తుంది. భక్తుల్లో నెలకొన్న అహం భావాన్ని తొలగించి జ్ఞాన సిద్ధి, బ్రహ్మ పద ప్రాప్తి ప్రసాదించేందుకు స్వామి వారు హంస వాహనంపై కనిపిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ కార్యక్రమంలో అర్చకులు గుండురావు, సత్య, రామకృష్ణ, సాయి శ్రీనివాస్, ఆలయ సిబ్బంది మారుతి ప్రసాద్, దీపక్, రామకృష్ణ, రాఘవేంద్ర, దండా వెంకటేశులు, నరసింహులు, నాగేంద్ర, ఉత్సవదాతలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యా కానుక స్టాక్ పాయింట్

# ఆకస్మిక తనిఖీ..



### జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి..

**కూడేరు మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో విద్యా కానుక నిల్వ ఉంచే స్టాక్ పాయింట్ను జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలను ఆమె పరిశీలించారు. ఎన్ని పుస్తకాలు వచ్చాయి,ఇంకా ఎన్ని రావాల్సి ఉంది, మండలానికి సరిపడా పుస్తకాలు వచ్చాయా లేదా?రావాల్సిన వాటికి ఎప్పటికప్పుడు ఇండెంట్ రెడీ చేసి టెక్స్ట్ బుక్ గోడౌన్ ఇంచార్జికి అందించి తగిన పుస్తకాలను పొందాలని డీఈవో తెలియజేశారు.

అదేవిధంగా ఈ సంవత్సరం విద్యా కానుక నిల్వ ఉంచే గదులను పరిశీలించారు. వస్తువుల వారీగా టీం లను ఏర్పాటు చేసుకోవాలని క్లస్టర్ రిసోర్స్ పర్సన్ లు, ఎంఆర్సి సిబ్బంది అందరిని కలుపుకొని విద్యా కానుక పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ప్రతి విద్యార్థికి విద్యా కానుకలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. విద్యా కానుకకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు తయారు చేసుకోవాలని మండలానికి చేరిన వస్తువుల వివరాలను మండలం నుంచి పాఠశాలలకు పంపిణీ చేసిన విద్యా కానుకుల కిట్లను,వస్తువుల వివరాలను పొందుపరచాలని తెలియజేశారు.

కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు చంద్రశేఖర్ 1, సాయి కృష్ణ,2, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు వెంకటరమణ,శివప్రసాద్, ఆదిలక్ష్మి, ఆంజనేయులు, నాగమణి,సురేంద్రబాబు, ఆదామ్బి, కుంటున్న తదితరులు పాల్గొన్నారు.



## ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

పుట్టపర్తి మేజర్ న్యూస్:డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఇన్ ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఉద్యోగాలకు ఏపీపీఎస్సీ చేపట్టే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని శ్రీ సత్యసాయి జిల్లా రెవిన్యూ అధికారి కొండయ్య పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం లో సమావేశం జరిగింది. శనివారం ఏపీపీఎస్సీ పరీక్ష జరుగుతుందని, జిల్లాలో 110 మంది అభ్యర్థులు ఏపీపీఎస్సీ పరీక్షకు హాజరు కాబోతున్నారన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వెనక బీడుపల్లిరోడ్డు లో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష నిర్వహణకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. మొబైల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్, ట్యాబ్స్, ఐప్యాడ్, బ్లూటూత్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, హ్యాండ్ బ్యాగులు, రైటింగ్ ప్యాడ్ల కు పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. ఉదయం 9 నుంచి 11:30 గంటల వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షగా ఏపీపీఎస్సీ నిర్వహిస్తోందన్నారు. అభ్యర్థులను ఉదయం 7:30 నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. ఉదయం 8:30 గంటల తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు,ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు,సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## విత్తనకాయల పంపిణీ ప్రారంభం..



అనంతపురం , మేజర్ న్యూస్ : పామిడి.మండలంలోని ఖరీఫ్లో వేరుశనగ పంటను సాగు చేస్తున్న రైతులకు రాయితీపై అందజేస్తున్న వేరుశనగ విత్తనకాయల పంపిణీ శుక్రవారం మండల వ్యవసా యాధికారి లీనా వసుంధర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో 1284 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నార న్నారు. ఆ రైతులకు 1126.50 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించడం జరిగిందన్నారు. డబ్బు చెల్లించిన రైతులకు వరుస క్రమంలో 40శాతం రాయితీతో విత్తన కాయలను అందజేస్తామ న్నారు. ఆధార్, పాసుబుక్కు, బయోమెట్రిక్ ద్వారా పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరావు, ఆర్బీకే సిబ్బంది, రైతులు తదిత రులు పాల్గొన్నారు..

## దివ్యాంగ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్చండి

**- జిల్లా ఐఈఆర్టి కోఆర్డినేటర్ ఆనందబాబు, ఎంఈఓ లు**

ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ : దివ్యాంగులను అన్ని విధాలుగా చదివించేందుకు ప్రభుత్వం ఒక ప్రత్యేక పాఠశాలను ఎల్సికేపురంలో ఏర్పాటు చేసిందని, అందులో వికలాంగులు గల పిల్లలను తల్లిదండ్రులు చేర్పించాలని కోఆర్డినేటర్ ఆనంద్ బాబు, ఎంఈఓ లు గోపాల్ నాయక్, రాజేశ్వరి దేవిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరం మండలంలో ఇంటింటా సర్వే చేసి బడి ఈడు పిల్లలందరినీ కూడా గుర్తించడం జరిగిందని, ఇందులో 320 మంది దివ్యాంగులు ఉన్నారని ఇప్పటిదాకా 175 మంది విద్యార్థులను వివిధ పాఠశాలలలో నమోదు చేయించడం జరిగిందన్నారు. మిగిలిన 25 మంది విద్యార్థులు సర్వేలో గుర్తించి పాఠశాలలో చేర్పించడం జరుగుతుందన్నారు. దివ్యాంగ పిల్లలకు పాఠశాలలో ఎన్రోల్మెంట్ అయినట్లయితే వారికి ఎస్కార్ట్ అలవెన్స్ కింద సంవత్సరానికి రూ.3,000, ట్రాన్స్పోర్ట్ అలవెన్స్ కింద సంవత్సరానికి రూ.3,000లు, బాలికలకు స్టైఫెండ్ 2000 రూపాయలు, బ్లైండ్ ఉన్నట్లయితే వారికి బ్లైండ్ లీడర్ కింద 3000 రూపాయలు సర్వ శిక్ష అభియాన్ ద్వారా ఇవ్వబడుతుందని తెలిపారు. కావున తల్లిదండ్రులు తప్పక పాఠశాలలో చేర్పించి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఐ ఈ ఆర్ టి సరస్వతి, మల్లికార్జున పాల్గొన్నారు.



# మండల అధికారులతో తహసీల్దార్ సమీక్ష..

**- భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశం..**

కూడేరు మేజర్ న్యూస్ : రానున్న ఆది సోమవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండల అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ రత్న రాధిక సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో మండల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రానున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ప్రమాదాలు ఇబ్బందులకు గురికాకుండా అప్రమత్తం చేయాలన్నారు. రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు వారికి సంబంధించిన గ్రామాల్లో ఉండి ప్రమాద సూచికలపై ప్రజలను అప్రమత్తపు చేస్తూ ప్రమాదాలు నష్టాలు అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామ రెవెన్యూ అధికారులు సచివాలయ సిబ్బంది విద్యుత్ శాఖ అధికారులు గ్రామస్థాయిలో ముఖ్యంగా పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డిఎంకె భాష, డిప్యూటీ తహసిల్దార్ విశ్వనాథ్, ఆర్ ఐ ప్రశాంత్ కుమార్, మండల వ్యవసాయ అధికారి విజయకుమార్, విద్యుత్ శాఖ అధికారులు గ్రామపంచాయతీ కార్యదర్శులు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్థానిక మండల తాసిల్దార్ కార్యాలయం నందు శుక్రవారం తాసిల్దార్ రత్న రాధిక, మండలవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు



చేయడం జరిగిందని ఆమె తెలిపారు, ఈ సందర్భంగా తాసిల్దార్ రత్న రాధిక మాట్లాడుతూ ఆదివారం, సోమవారం రాబోవు భారీ వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజలకు ఎలాంటి ప్రమాదా లుకు గురికాకుండా గ్రామీణ ప్రాంతాల్లో గల ప్రజలను,వారిని అప్రమత్తం చేయడం, పంట సాగు చేసిన రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డీఎంకే భాష, డిప్యూటీ తాసిల్దార్ విశ్వనాథ్, ఆర్ ఐ ప్రశాంత్ కుమార్, మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్, విద్యుత్ శాఖ అధికారులు, గ్రామపంచాయతీ సెక్రెటరీలు, అన్ని ప్రభుత్వ శాఖలఅధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సహకారం ఒక జీవన విధానం...

**- సభ్యులను భాగస్వాములు చేస్తేనే బ్యాంక్ అభివృద్ధి...**

**- ది విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచ్ ఇంచార్జ్ డైరెక్టర్ జి వి సత్యనారాయణ మూర్తి**

అనంతపురం విద్య మేజర్ న్యూస్ : సహకారం ఒక జీవన విధానం గా నమ్ముతున్నదని ఒకరి కోసం అందరూ అందరి కోసం ప్రతి ఒక్కరు అనే నినాదంతో ది విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క కార్యక్రమాలను సభ్యులకు వివరంగా తెలియజేస్తున్న ఏకైక కో-ఆపరేటివ్ బ్యాంక్ అని ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ ఇన్చార్జి డైరెక్టర్ జె.వి సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో 2023- 24 అనంతపురం బ్రాంచ్ సభ్యుల మహాసభ నిర్వహించారు. కార్యక్రమానికి ది విశాఖ కో-ఆపరేటివ్ అనంతపురం బ్రాంచ్ ఇంచార్జ్ డైరెక్టర్ పి.నారాయణ స్వామి అధ్యక్షత వహించగా.. ఇన్చార్జి డైరెక్టర్ జె.వి సత్యనా రాయణమూర్తి, బ్రాంచ్ మేనేజర్ తట్టుపర్తి ఉదయ్ కృష్ణ సురేష్, జోనల్ మేనేజర్ హైదరాబాద్ జోన్ పి. ప్రసాద్ రావు, గుత్తి బ్రాంచ్ ది విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ జిలాన్ భాష పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అనంతపూర్ లో ది విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ 12 ఫిబ్రవరి 2017 లో ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం కోపరేటివ్ సభ్యులుగా 549 మంది ఉన్నారన్నారు. డిపాజిట్లు 6.41కోట్లు, రుణాలు 33.56 కోట్లు, షేర్ దానం 1.03 కోట్లు, నిరార్థక ఆస్తులు 0.41 ఉందన్నారు. రాబోవు కాలంలో డిపాజిట్లను మరింత పెంచే దిశగా పని చేయాలన్నారు.



బ్యాంక్ సభ్యులకు వారి కుటుంబ సభ్యులకు దేశంలోని ఏ సహకార బ్యాంకు లోను అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. విద్యలో ప్రతిభ కనబరిచిన సభ్యుల పిల్లలకు నగదు పురస్కారాలు ఇవ్వడమే కాకుండా వారికి తక్కువ వడ్డీ పై విద్య రుణాలు అందిస్తున్నామన్నారు. డిపాజిట్లపై జాతీయ వాణిజ్య బ్యాంకులు కన్నా అధిక వడ్డీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు 50 శాఖల సభ్యులతో సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. బ్యాంక్ అభివృద్ధికి , సేవలు విస్తారనకు సహకరిస్తున్న సభ్యులకు, ఖాతాదారులకు, న్యాయ సలహాదారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం బ్రాంచ్ కోఆపరేటివ్ అధికారులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీ వేరుశనగ అక్రమంగా కొనుగోలు చేస్తే చర్యలు చేపడతాం

**- ఏడిఏ సత్య నారాయణ**

ముదిగుబ్బ, మేజర్ న్యూస్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతాంగ అవసరాల నిమిత్తం ప్రభుత్వం సబ్సిడీ ధరలపై పంపి ణీ చేపట్టనున్న విత్తన వేరుశనగ కాయలు పక్కదారి పట్టకుండా తగు ముందస్తు చర్య లు చేపట్టామని, సబ్సిడీ కాయలను అక్రమంగా కొనుగోలు చేస్తే వ్యాపారుల పైన చర్యలు తీసుకుంటా మని వ్యవసాయ శాఖ ఏడిఏ సత్య నారాయణ తెలిపారు. శుక్రవారం విత్తన వేరు శనగ అవసరమైన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రా లలో తమ పేర్లు వివరా లు నమోదు చేసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులకు సంబంధిత రైతు భరోసా కేంద్రా లలో విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామ న్నా రు. రైతాంగానికి సబ్సి డీ ధరలపై అందిస్తున్న వేరుశనగను దళా రులు రైతులను మభ్య పరిచి కొనుగోలు చేసి న, అక్రమంగా తరలించినా, విలువ ఉంచుకున్న వారిపై కేసులు నమోదు చేస్తామ న్నారు. సబ్సిడీ విత్తనా లను రైతులకు సకా లంలో స్థానికంగా పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టామ న్నారు. అనంతరం మండల పరిధిలోని జొన్నలు కొత్తపల్లి, సంకేపల్లి రైతు భరోసా కేంద్రాలను



ఆయన తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలకు వచ్చిన విత్తన నాణ్యతను, రైతుల పేర్ల నమోదును పరిశీలించారు. సబ్సిడీపై రైతులకు కే-6 రకం, 1812 వేమన రకం, టి సిజి ఎస్1694 వశిష్ట రకాల వేరుసెనగ కాయలను అందుబాటులో ఉంచడం జరిగింద న్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి లక్ష్మీనరసింహ, ఏఈఓ షరీఫ్, క్షేత్ర సాయి సిబ్బంది పాల్గొన్నారు.

# అడ్మిషన్లు లేక..

## వెల వెల బోతున్న ప్రభుత్వ కాలేజీలు

-పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపని తల్లిదండ్రులు

-తగ్గిపోతున్న ఉత్తీర్ణత శాతం

-ఇంకా ప్రారంభం కానీ అడ్మిషన్లు ప్రక్రియ

-ప్రైవేట్ కళాశాలలో ఊపందుకున్న ప్రవేశాలు

-విద్యార్థులనుచేర్పించేందుకు నాన్న తండాలు పడుతున్న అధ్యాపకులు

**ధర్మవరం మేజర్ న్యూస్..** ప్రభుత్వ కళాశాలలంటే విద్యార్థిని విద్యార్థులతో కళకళలాడిపోయేవి... ప్రభుత్వ కళాశాలలో తమ పిల్లలను చేర్పించేందుకు సిఫారసులు కూడా ఓ మోతాదులో ఉండేవి. ప్రభుత్వ కళాశాలలో తమ పిల్లలకు సీటు వస్తే చాలు ఆ తల్లిదండ్రుల్లో ఎనలేని సంతోషం.... ఇది ఒకప్పటి మాట... ప్రస్తుతం అదే కాలేజీలో విద్యార్థులు లేక వేలవేలపోయే పరిస్థితికి చేరుకుంది. ఆ ప్రభుత్వ కళాశాలలో నూతన అడ్మిషన్లు నానాటికి తగ్గిపోతున్నడం చివరికి ఆ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు లేక బోసిపోతున్నాయి. కాలానుగుణంగా ప్రభుత్వం పట్టిష్టమైన చర్యలు తీసుకోకపోగా అదే తరుణంలో భారీ ఎత్తున ప్రైవేటు కళాశాలలో పుట్టుకు రావడం ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల మధ్య అటు విద్యాభ్యాసం లోను ఇటు ఉత్తీర్ణత శాతం లోను భారీగా తేడా ఉండడం వల్ల ప్రస్తుతం తల్లిదండ్రులు తల్లిదండ్రులు ప్రైవేటు వైపుకు మొగ్గుచూపుతున్నారు. తమ టాలెంట్ను నిరూపించుకోవడానికి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం మధ్య విపరీతమైన పోటీతత్వం కూడా ప్రభుత్వ కళాశాలను అంధకారం వైపు నెట్టేస్తోంది. సత్య సాయి జిల్లాలోనీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు లేక అధ్యాపకులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇంటర్ కళాశాలల్లో అడ్మిషన్లు లేక కొన్ని గ్రూపులను ఎత్తివేసే పరిస్థితి జిల్లాలో ఏర్పడుతోంది. సత్య సాయి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 21 ఉండగా, ఒకటి ఏడెడ్ కాలేజీ, 10 మోడల్ కాలేజీలు కేజీబీవీ కాలేజీలు, ఒకటి ఏపీఆర్జేసీ, ఎస్సీ ఎస్టీ బీసీ వెల్ఫేర్ తరపున పది కాలేజీలు నడుస్తున్నాయి. అదేవిధంగా 40 ప్రైవేట్ జూనియర్ కళాశాలలో వెలిశాయి. ప్రైవేట్ జూనియర్ కళాశాలలో యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో అటు అడ్మిషన్లతోపాటు ఇటు ఉత్తీర్ణత శాతం పెరుగుతుండడం తో తల్లిదండ్రులు కూడా అటువైపే మొకుచూపుతుండడంతో చివరికి ప్రభుత్వ కళాశాలలు అడ్మిషన్ లేక డీలపడే పరిస్థితి దాపురిస్తోంది. ప్రైవేట్ కళాశాలలో ఇప్పటికే యాజమాన్యం ఇంటింటికి తిరిగి అడ్మిషన్లను చేర్పించుకోగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రక్రియ ఇంకా ప్రారంభమే కాలేదు. గత ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతం తగ్గుముఖం పడుతూ ఉండడంతో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు నిరాశక్తిత వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఇంటర్ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో అడ్మిషన్ల ప్రక్రియకు గ్రహణం ఏర్పడింది.

### కలగా మారిన ఇంటర్ గ్రూపులు.....



జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఒక్కో కళాశాలలో ఎంపీసీ బైపిసి సిఇసిహెచ్ఈసి గ్రూపులో 100 చొప్పున ప్రతి ఏడాది 400 మందికి అడ్మిషన్లు కల్పించాల్సి ఉంటుంది. వీటికి తోడు ఒకేషనల్ కోర్సుల్లో 80 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తారు. అయితే ప్రతి ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల విషయంలో ఇంటర్ బోర్డు అధికారులు చేస్తున్న జాప్యం వల్ల విద్యార్థులను ప్రైవేటు యాజమాన్యాలు ఎగిరేసుకుపోతున్నాయి. దీనికి తోడు ప్రభుత్వ కళాశాలలో ఉత్తీర్ణత శాతం కూడా ఆశాజనకంగా లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది జిల్లాలో ప్రభుత్వ కస్తూరిబా గాంధీ బాలికల కళాశాలలు గురు కులాలు ప్లస్ టు స్కూల్ నుంచి దాదాపు 12 వేల మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు హాజరు కాగా ఇందులో 55% ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరంలో 68 శాతం పైగా ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఫలితాలను చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆ కళాశాలలో పిల్లలను చేర్పించేందుకు వెనుకడుగు వేసే పరిస్థితి ఏర్పడుతోంది. సత్య సాయి జిల్లా ఏర్పడి రెండేళ్లు పూర్తయిన ప్రభుత్వ కళాశాల నిర్వహణ గాడిన పడలేదు. రెండేళ్లు పూర్తిస్థాయిలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి లేకుండానే ఇన్చార్జి వ్యవస్థ కొనసాగుతూ వచ్చింది. విద్యాశాఖ అధికారి అన్ని కళాశాలను తిరిగి పర్యవేక్షించి కళాశాలలో పూర్వైభవం తీసుకురావడానికి పూర్తిగా విఫలమవుతున్నారు. మొక్కుబడిగా విధులు నిర్వహిస్తుండడంతో కళాశాలలపై పర్యవేక్షణ కొరవడుతోంది.

### అడ్మిషన్ల పై స్పష్టత ఏది?...

జిల్లాలో ఒకవైపు ప్రైవేట్ కళాశాలలో ఇప్పటికే అడ్మిషన్లు పూర్తికాగా ప్రభుత్వ పాఠశాలలో మాత్రం అడ్మిషన్లు విషయంలో అధికారులకు స్పష్టత రాలేదు. వాస్తవానికి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వేసవి సెలవులు ఇచ్చినప్పటికీ కళాశాలలో అడ్మిషన్ కొనసాగించాల్సి ఉన్న ఎక్కడ ఆ విధంగా చేయడం లేదు కేవలం మొక్కుబడి అడ్మిషన్లు జరుగుతున్నట్టు కళాశాల వద్ద బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ప్రస్తుతం ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయి. ఈనెల 31వ తేది వరకు ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు కళాశాలలో నిర్వహిస్తున్నారు. ఆయా పరీక్షల నిర్వహణ ఏర్పాటలో ఉన్న అధికారులు ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ల విషయంలో నిర్లప్తత ప్రదర్శిస్తున్నారని విమర్శలు సర్వత్ర వినిపిస్తున్నాయి.

### ప్రైవేట్ కళాశాలలో జోరందుకున్న అడ్మిషన్లు...

సత్య సాయి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ఇంకా ప్రారంభం కాకపోయినా ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాల మాత్రం విద్యార్థుల వేటలో పడ్డారు. ధర్మవరం హిందూపురం, కదిరి, పెనుగొండ, మడకశిర, పుట్టపర్తి కేంద్రాలుగా నడుస్తున్న కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ కళాశాల నుంచి పిఆర్ఓ ల పేరుతో పలువురు ప్రతినిధులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రవేశాల కోసం చర్చలు జరుగుతూ అడ్మిషన్లు చేయించుకోవడంలో సక్సెస్ అవుతున్నారు. విద్యార్థుల వివరాలు ఫోన్ నెంబర్లు చిరునామాలు సేకరించి కళాశాలలకు రావాలని ఆహ్వానం పలుకుతున్నారు. కొన్ని కళాశాల యాజమాన్యాలు ఇంటింటికి వెళ్లి గోచర్ల నుంచి ఫీజు రాయితీలు కూడా ఇస్తామని హామీలు గుర్తించి విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి అడ్వాన్సుల రూపంలో కొంత మొత్తం నగదు కట్టించుకునే సీటు రిజర్వ్ చేస్తున్నట్లు సమాచారం. ప్రైవేట్ కళాశాలలో పట్టుదలతో పనిచేస్తూ అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తుండగా ప్రభుత్వ కళాశాలల అధికారులు మాత్రం అడ్మిషన్ల విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వివరిస్తుండడంతో అధ్యాపకులే పిల్లలు తగ్గితే తమ పోస్టు గల్లంతగుతుందన్న భయంతో అడపాదడపా తల్లిదండ్రుల వద్దకు వెళ్లి అడ్మిషన్లు పై చొరవ చూపిస్తున్నారు. ఇందులో కొందరు అధ్యాపకులు తమ టార్గెట్ కు తగ్గ నానా తంతాలు బడి అడ్మిషన్లు చేయించుకుంటుండగా కొన్ని గ్రూపులలో చేరడానికి చేరడానికి విద్యార్థులు అయిష్టత చూపుతుండడంతో ఆ కళాశాలలో అధ్యాపకుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. పిల్లలు తగ్గితే తమని ఎక్కడ దూర ప్రాంతానికి బదిలీ చేస్తారని ఉన్న భయం ఆయన అధ్యాపకులలో పుట్టుకొస్తోంది. ఏదేమైనా ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు సంఖ్య నానాటికి తగ్గిపోతుండడం పేదవిద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది.

## రొద్దంలో ఉచిత వైద్య శిబిరం



**రొద్దం, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో శ్రీ సాయి విద్యా మందిరం స్కూలు ఆవరణంలో శనివారం శ్రీ సాయి రూరల్ డెవలప్మెంట్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు తెలిపారు. హిందూపురం నుంచి ఆశ్రయ మల్టీ స్పెషాలిటీ వైద్యులు రావడం జరుగుతుందని తెలిపారు. బీపీ, షుగర్, ఊపిరితిత్తులు, రక్తహీనత, మూర్ఛ వ్యాధి, అన్ని రకాల లివర్ సంబంధిత వ్యాధులుఅన్ని రకాల జబ్బులకు ఉచితంగా వైద్యం అందిస్తారన్నారు. కావున మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## స్ట్రాంగ్ రూముల్లో మూడంచెల భద్రత ఏర్పాటు

**- ఆర్డీవో, రిటర్నింగ్ ఆఫీసర్ వెంకట శివరామిరెడ్డి**



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** ఈ నెల 13వ తేదీన ధర్మవరం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలు హిందూపురం పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించడం జరిగిందని, వీటికి సంబంధించిన ఓటింగ్ మిషన్, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లను, వివి ప్యాట్లను, లేపాక్షి మండలం చోళ సముద్రం, నాయన పల్లి క్రాస్ వద్దగల డాక్టర్ అంబేద్కర్ గురుకులం స్కూల్లో భద్రపరచడం జరిగిందని, ఇక్కడ మూడంచెల భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్డీవో రిటర్నింగ్ ఆఫీసర్ వెంకట శివరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండంచెల భద్రతను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని, ఇక్కడ వరకే అనుమతి ఉండేదని తెలిపారు. ప్రస్తుతం జూన్ 4వ తేదీన లెక్కింపు చేయు వరకు స్ట్రాంగ్ రూమ్ వరకు వెళ్లి ఏర్పాటు చేయబడిన భద్రతా విషయములను పరిశీలన చేసుకొనుటకు మూడంచెల భద్రత ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందుకు జిల్లా కలెక్టర్ వారి అనుమతి కూడా లభించిందని తెలిపారు. అభ్యర్థులు లేదా వారి తరపున ఏజెంట్ గాని స్ట్రాంగ్ రూమ్ పరిశీలన కొరకు ఉదయం 10 గంటల నుండి 11 గంటల మధ్య లేదా మధ్యాహ్నం మూడు గంటల నుండి నాలుగు గంటల మధ్య స్ట్రాంగ్ రూమ్ పరిశీలన చేసుకొని తెలిపారు. అనుమతి లేనిదే ఎవరిని కూడా ప్రవేశింప చేయమని తెలిపారు.

## ఎంపీపీ చంద్రశేఖర్‌కు పరామర్శ



**రొద్దం, మేజర్ న్యూస్ :** అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎంపీపీ చంద్రశేఖర్ ను శుక్రవారం రొద్దం నాయకులు రవి శేఖర్ రెడ్డి, లక్ష్మీనారాయణ గుప్తా, నాగరాజు, షామీర్, తదితరులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం నింపారు.

## ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

**- ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర**



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్:** పట్టణంలో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నడపబడుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర, ఏఐ ఎస్బిఐ జిల్లా కార్యదర్శి పోతులయ్య కొత్తచెరువులోని జిల్లా విద్యాశాఖ అధికారి సూపర్డెంట్ ప్రసాద్కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాల నిర్మాణ దశలో ఉన్నప్పటికీ గొట్లురు గ్రామంలో గల అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతున్న నైరా ఏరి డైట్ పాఠశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మా పాఠశాలలో చేర్పిస్తే డిస్కౌంట్ ఇస్తామన్న పట్టణంలో ప్రచారం చేస్తున్నారని, ప్రభుత్వ రూల్ ప్రకారం ప్రభుత్వం గడువు ఇచ్చినప్పుడు మాత్రమే ప్రవేట్ పాఠశాలలు అడ్మిషన్ చేసుకోవాలని నిబంధన తుంగలో తొక్కారని మండిపడ్డారు. ధనమే ఆర్జేనంగా, రంగురంగుల కరపత్రాలను ప్రచారాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. గతంలో ఎంఈఓ కు, ఆర్డిఓ కు తెలియజేసిన ఎటువంటి స్పందన లేదని తెలిపారు. ఇప్పటికైనా నైరా ఏరి డైట్ పాఠశాల పై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున పాఠశాల ఎదుట ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నందకిషోర్, మురళి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా అమ్మవారికి బోనాలు సమర్పణ

నంబులపూలకుంట, మేజర్ న్యూస్ : మండల కేంద్రంలోని నల్ల గంగమ్మ ఆలయం వద్ద శుక్రవారం మహిళలు పెద్ద ఎత్తున ఘనంగా అమ్మవారికి బోనాలు సమర్పిం చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి గ్రామాలను చల్లగా కాపాడుతున్న అమ్మవారి దేవాల యాలలో మొలకల పౌర్ణమి సందర్భంగా బోనాలు సమర్పించడం ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం గ్రామ మహిళలంతా కలిసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తు లు పూజలు సాంప్ర దాయ సారాలతో గంగమ్మ ఆలయం పులకించింది. అమ్మ గంగమ్మ తల్లి చల్లగా చూసి నా కుటుంబాలను కాపాడమ్మా అంటూ భక్తులు చేతులు జోడించి అమ్మవారిని వేడుకు న్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కదిరి, మేజర్ న్యూస్ :పట్టణంలోని 11 కెవి డి -4 ఫీడర్ నందు మెయింటెనెన్స్ ను శనివారం ఉదయం చేపట్టడం జరుగుతుం దని కదిరి విద్యుత్ డి మోసెస్, ఏఈ శ్రీని వాస్ నాయక్ తెలిపారు. కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎన్జీవో కాలనీ, సాయిబాబా టెంపుల్ ఏరియా, వాణి వీధి, రాజేంద్రప్రసాద్ వీధి, బండారు నగర్, ఇంది రా నగర్, సైదాపురం ఎస్సీ కాలనీ, డిగ్రీ కాలేజ్ ఎదురుగా, ఎర్ర గుంట్లపల్లి, కుమ్మ రోళ్లపల్లి, కుటాగుళ్ల రైల్వే గేట్, జగనన్న కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తు న్నట్లు ఏఈ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని ఏఈ తెలిపారు.

## ఏటి గంగమ్మకు బోనాల సమర్పణ



తలుపుల, మేజర్ న్యూస్ :మండల కేంద్ర సమీపంలో వెలసిన ఏటి గంగమ్మకు గత రెండు రోజులుగా భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రెండవ రోజు మొలకల పౌర్ణమి సందర్భంగా మహిళలు భారీ సంఖ్యలో బోనాల సమర్పించారు. ప్రతి సంవత్సరం మొలకల పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి తలుపుల మహిళలు బోనాల సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. మహిళలంతా ఒకేసారి బోనాలు నెత్తిన పెట్టుకొని మేళతా ళాలు గొడుగులతో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఏటి గంగమ్మకు పూజలు నిర్వహించడం వల్ల ఈ సంవత్సరమంతా వర్షాలు సమృద్ధిగా కొరిచి పంటలు బాగా పండుతాయి అని, కుటుంబాలు సుఖసం తోషాలతో ఉంటాయని భక్తుల విశ్వాసం. మహిళలు ఒక్క సారిగా బోనాలతో తరలిరావడంతో తలుపుల పురవీధులు జాతర ను తలపిం చాయి.

## ద్వితీయ బహుమతిని సాధించిన వాల్మీకి స్కూల్ విద్యార్థినులు..

కదిరి, మేజర్ న్యూస్ : పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఈనెల 23న జాతీయ స్థాయి శాస్త్రీయ కూచిపూడి జంట ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలో కదిరి పట్టణంలోని వాల్మీకి పాఠశాల స్కూలుకు చెందిన ఐదవ తరగతి విద్యార్థిని మన్యశ్రీ, మూడవ తరగతి విద్యార్థిని మనస్వి లు జంట నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో ఇరువురి విద్యార్థుల ప్రదర్శనకి ద్వితీయ బహుమతి సాధించడం జరిగింది. శాస్త్రీయ కూచిపూడి నృత్య జంట ప్రదర్శన లో బహుమతి సాధించిన విద్యార్థినులను పాఠశాల కరస్పాండెంట్ అనిల్ కుమార్ రెడ్డి, అధినేత పవన్ కుమార్ రెడ్డి, తల్లిదండ్రులు విద్యార్థినులను అభినందించారు.



# అక్రమంగా నిల్వ చేసిన టపాసులు సీజ్ : ఎస్సై

మదిగుబ్బ, మేజర్ న్యూస్ : మండల పరిధిలోని ఇనుములవారిపల్లిలో ఎటువంటి అనుమ తులు లేకుండా అక్ర మంగా నిల్వచేసిన రూ. 70 వేలు విలువ చేసే టపాసులను సీజ్ చేసినట్లు పట్నం ఎస్ఐ నరసింహుడు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో సమస్యా త్మక గ్రామాలలో ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు, అసాం ఘిక కార్యకలాపాలు తలెత్తకుండా ముంద స్తు చర్యలు చేపట్టా లని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు సమస్య ఆత్మక గ్రామాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందు లో భాగంగా తమ కు అందిన సమాచారం మేరకు మండల పరిధి లోని ఎనుములవారి పల్లి చెందిన సూర్య నారాయణ రెడ్డి ఇంటి లో తనిఖీలు చేపట్టడం జరిగిందని, ఇంటిలో ఒక గదిలో ఎటువంటి అనుమతులు లేకుం డా నిలువ ఉంచిన సుమారు రూ.70 వేల విలువ చేసే టపాసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ఎటువంటి అనుమతులు లేకుం డా టపాసులు, పెట్రోలు, డీజలు, వంటి వాటిని అనధికారికంగా నిలువ



ఉంచుకొనడం నేరమని, అటువంటి వాటిని నిలువ ఉంచు కున్న వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

# రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగను అందించాలి

కదిరి, మేజర్ న్యూస్: రైతుల విత్తనాలు కోసం ఇచ్చే వేరుశనగ ఇతర ధాన్యాల నాణ్య తలో రాజీ పడకూ డదని నాణ్యమైన విత్తనా లు పంపిణీ చేయాలని బిజెపి కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ రాష్ట్ర కన్వీనర్ చింతా శరత్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ములో రైతాంగానికి ఖరీఫ్ సీజన్లో విత్తనాల కోసం సబ్సిడీ ధరలపైన పంపిణీ చేస్తున్న విత్తనం వేరు శనగ లను నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికా రులకు చింత శరత్ కుమార్ రెడ్డి సూచిం చారు. పంట విత్తనా లు నాణ్యమైనవి అయితేనే వచ్చే పంట బాగుంటుంది తద్వారా రైతాంగానికి ఉప యోగంగా ఉంటుందని ఆయన అధికారుల కు కోరారు. వేరుశనగ విత్తనాలు రైతులకు తక్కువ కాకుండా అందుబాటులో ఉంచా లని



అంతర్ పంట కోసం రైతులు వేసు కొని కంది, మిను ములు, పెసలు, కొర్రలు, రాగి, జీలుగా పిల్ల పెసర్ల, ఉలవలు, అలసందలు వంటి ధాన్యాలు కూడా రైతులకు అందుబా టులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతర్ పంట ధాన్యాల సబ్సిడీ ధరలు కూడా ప్రభు త్వం వెంటనే ప్రకటిం చాలని ప్రభుత్వాన్ని కోరారు. తృణధాన్యాల 80 శాతం సబ్సిడీపై రైతులకు సరఫరా చేయాలని ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. ఈ జిల్లాలో అధికంగా రైతులు వేయాలని కోరారు.

యువ రైతులు చదువుకున్న టువంటి రైతన్నలు ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయాన్ని చేయా లని సూచించారు. సేంద్రియ వ్యవసాయం ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభసాధిగా ఉన్నదని ఆయన కోరారు. రైతులు పెట్టుబడుల కోసం అధిక ధరలు రసాయన ఎరువులు కొని నష్టపోతున్నారని తద్వారా పంట పొలాలు కూడా నిసారమైపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# గార్మెంట్స్ మహిళా కార్మికులకు బస్సు సౌకర్యం కల్పించాలి - ఏఐటీయూసీ

హిందూపురం మేజర్ న్యూస్:- గార్మెంట్స్ మహిళా కార్మికులకు బస్సు సౌకర్యం కల్పించాలని శుక్రవారం నాడు హిందూపురం పట్టణంలోని ఏఎల్ఓ శేఖర్ బాబు కి ఏఐటియుసి నాయకులు వినతి పత్రం అందించడం జరిగింది. గురువారం నాడు చిలమత్తూరు మండలం కోడూరు తోపు వస్త్ర పరిశ్రమకు చెందిన కార్మికులు వడ్డిపల్లి వద్ద ఆటో బోల్తా పడి గాయపడటం ఇలా తరచూ ఆ పరిశ్రమకు వెళ్లే కార్మికులు ఆటోల ప్రమాదాలు జరుగుతుండడంతో కార్మికుల జీవితాలు రోడ్డు పాలు అవుతున్నయని యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని వెంటనే కార్మికులందరికీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్ కేశవులు కి ఫోన్ ద్వారా విషయం తెలియజేయగా తాము వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నాడు. జిల్లా కార్మిక శాఖ అధికారులకు ఈ విషయాన్ని తెలియజేసి యాజమాన్యం బస్సు సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఐటియుసి నాయ



కులు కార్మిక శాఖ అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కనిశెట్టిపల్లి వినోద్ కుమార్, జిల్లా కోశాధికారి డి.బాబు, తుమకుంట పరిశ్రామిక వాడా కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి మారుతి రెడ్డి, ఉపాధ్యక్షులు కమల్ బాషా, జిల్లాన్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు కిందపడి చేనేత కార్మికుడు మృతి

ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ : పట్టణంలోని మారుతీ నగర్ కు చెందిన వరప్రసాద్ (30) అనే చేనేత కార్మికుడు రైలు కింద మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు వరప్రసాద్ బీటెక్ చదువు పూర్తి చేసుకుని పట్టణములో మరమగాలను నేస్తూ జీవనం కొనసాగించేవాడు. అయితే మగ్గాల ద్వారా నేసిన చీరలకు అన్ సీజన్ వల్ల సరిగా అమ్ముడుపోక నష్టం రావడం వల్ల మనస్థాపానికి గురై, పట్టణంలోని గుట్ట కింద పల్లి వద్దగల రైల్వే ట్రాక్ మీద రైలు క్రింద పడి ఆత్మహత్య చేసుకుని చనిపోవడం జరిగింది. బీటెక్ చదివినా కూడా ఉద్యోగం రాకపోవడంతో, కుటుంబ పోషణ నిమిత్తం మరమగ్గల నేస్తూ జీవించేవాడు. మృతునికి ఒక కూతురు, భార్య



మమత కూడా ఉన్నారు. ఈ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని మారుతీ నగర్ ప్రజలు, కుటుంబ బంధు మిత్రులు కోరుతున్నారు. ధర్మవ రం రైల్వే పోలీసులు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, సవ పరీక్ష అనంతరం మృతదేహాన్ని, కుటుంబ సభ్యులకు అందజేశారు.

# కలెక్టరేట్‌లో కౌంటింగ్ పర్సనల్స్ 1వ ర్యాండమైజేషన్ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి

**– 1,354 మంది కౌంటింగ్ పర్సనల్స్ నియామకం**

**– జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి**



అనంతపురం మేజర్ న్యూస్ : అనంతపురం కలెక్టరేట్ లోని ఎన్ఐసి భవనంలో శుక్రవారం కౌంటింగ్ పర్సనల్స్ 1వ ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి (ఐఏఎస్) చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఎన్ఐసి డిఐఓ రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు - 2024 కౌంటింగ్ కోసం పారదర్శకంగా కౌంటింగ్ పర్సనల్స్ 1వ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. కౌంటింగ్ కోసం 1,354 మంది కౌంటింగ్ పర్సనల్స్ ని నియమించడం జరిగిందన్నారు. ఎన్నికల కమీషన్ కౌంటింగ్ పర్సనల్స్ 1వ ర్యాండమైజేషన్ కోసం ప్రత్యేక సాఫ్ట్ వేర్ ను అభివృద్ధి చేయడం జరిగిందని, ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు సీపిఎంఎస్ సాఫ్ట్ వేర్ లో ఆన్ లైన్ ద్వారా అత్యంత పారదర్శకతతో కౌంటింగ్ పర్సనల్స్ 1వ ర్యాండమైజేషన్ ను చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు రాణిసుస్మిత, కరుణకుమారి, వి.శ్రీనివాసులు రెడ్డి, వసంతబాబు, వెన్నెల శ్రీను, జి.వెంకటేష్, పార్లమెంటరీ నియోజకవర్గం ఏఆర్ఓ రమేష్ రెడ్డి, ఈఆర్ఓ శిరీష, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, కలెక్టరేట్ ఏఓ అంజన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు 90% సబ్సిడీతో

# విత్తన వేరుశనగ పంపిణీ చేయాలి : సిపిఎం



అనంతపురం మేజర్ న్యూస్ : నేడు కళ్యాణదుర్గం పట్టణంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో 90 శాతం సబ్సిడీతో నాణ్యమైన వేరుశెనగ విత్తనాలు ఇవ్వాలని, కందులు, పెసలు, అలసందలు, ఆముదం, జొన్న విత్తనాలను ఉచితంగా ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దారు శ్యామ్ రాయ్ కి వినతిపత్రం అందజేసినారు... ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ 2023 ఖరీఫ్ వర్షాభావం వల్ల పంటలు మొత్తంగా నష్టపోయాయి. కరువు పరిస్థితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు పరిశీలించి జిల్లాలోని 29 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. ఈ ఖరీఫ్ ప్రారంభం నుండే జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. ఈ సంవత్సరం వర్షాలు బాగా పడే అవకాశం వుందని వాతవరణ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రకటిస్తుండడంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. అయితే గత సంవత్సరం పంటల నష్టంవల్ల సాగుకు అవసరమైన పెట్టుబడులు లేకపోవడం తీవ్ర సమస్యగా వుంది. మన ప్రాంతంలో ప్రధానంగా వేరుశెనగ సాగు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం గతం మాదిరే 40 శాతం సబ్సిడీతో సరాఫరా చేయాలని నిర్ణయించింది. జిల్లా మొత్తం కరువుగా ప్రకటించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలి. అందువల్ల 90 శాతం సబ్సిడీతో వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేయాలని అలటగే కందులు, పెసలు, అలసందలు, ఆముదం, జొన్న, సిద్ధ, కొర్ర విత్తనాలను ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలకు విత్తనకాయలు చేరుతున్నాయి. నాణ్యత పై ముందస్తు తనిఖీలేక గత సంవత్సరాల్లో పంపిణీ సమయంలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. కావున విత్తనాల నాణ్యతను పరిశీలించడంతో పాటు, నాశిరకం విత్తనాలను సప్లై చేసిన కంపెనీల మీద కఠిన చర్యలు తీసుకుని వ్యవసాయ సాగును పరిరక్షించాలని సిపిఎం పార్టీగా కోరుతున్నాము... ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రంగనాథ్, నాయకులు వంశీ,భవిత్,అరవింద్,ధనుష్,సంతోష్ కుమార్,అనిల్ పాల్గొన్నారు..

## పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

**– జిల్లా మలేరియా సహాయ అధికారి కె. సత్యనారాయణ**

ఉరవకొండ, మేజర్ న్యూస్ : పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, వాటి నిర్మూలనకు పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యతగా భావించాలని జిల్లా మలేరియా సహాయ అధికారి కె. సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం జిల్లా మలేరియా సహాయ అధికారి కె. సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శి ఏ. గౌస్ సాహెబ్, ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి తో కలిసి డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పాల్గొన్నారు. పట్టణంలోని ఐదు గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి పరిసరాల పరిశుభ్రత నిర్వహణ పట్ల ఆరా తీశారు. పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దోమకాటుతో వచ్చే వ్యాధుల పట్ల కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. అకాల వర్షాల ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణంలోని మురుగునీటి కాలువల నిర్వహణను అధికారులతో కలిసి పరిశీలించారు. మురుగునీటి కాలువలను సకాలంలో శుభ్రపరచాలని, నిర్లక్ష్యం పాటిస్తే పారిశుద్ధ కార్మికులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశుభ్రత నిర్మూలన పట్ల సంబంధిత కరపత్రాలను ఇంటింటికీ పంచిపెట్టారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటితోపాటు పరిసర ప్రాంతంలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని దిశా నిర్దేశం చేశారు. పట్టణములోని అపరిశుభ్రత నెలకొన్న మురికి ప్రాంతాల్లో ఎంఎల్ఓ ద్రావణముతో తయారుచేసిన 80 ఆయిల్ బాల్స్ దోమల నివారణలో భాగంగా వదిలారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.



## రాయితీ విత్తన వేరుశనగ కాయలు పంపిణీ ప్రారంభం..

**– రైతులు సద్వినియోగం చేసుకోవాలి మండల వ్యవసాయ అధికారి విజయకుమార్**

కూడేరు మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఖరీఫ్ సీజన్లో అందిస్తున్న సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం మండల వ్యవసాయ అధికారి విజయకుమార్, తహసిల్దార్ రత్న రాధిక, ఎంపీడీవో కమల్ భాష, వి ఎస్ ఏ డాక్టర్ శ్రీనివాస్, మండల అగ్రికల్చర్ అధికారి నెట్టికంటయ్య లు ప్రారంభించారు. మండల పరిధిలోని అన్ని ఆర్బికేలలో 650 మంది రైతులకు 560 క్వింటాళ్ల కే6 రకం విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ తెలిపారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు త్వరగా వేరుశనగ కాయలు తీసుకొని వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శైలజ, వీహెచ్ఎ సాజియా, మహిళ కానిస్టేబుల్ రమణమ్మ, వివిఏ కుమారి భవాని, పలువురు రైతులు పాల్గొన్నారు.



జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే
మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి
చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం..
మరింత సమాచారం అందించాల్సిన
వారు ఎప్పు డైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా
తెలియజేయాలని, ఎల్లవేళలా అందుబాటులో
ఉంటామని తెలియజేస్తున్నాం.
ఉమ్మడి అనంతపురం జిల్లాల
బ్యూరో అండ్ బ్రాంచ్ మేనేజర్
ఎన్. లక్ష్మీనారాయణ
ఫోన్ నెంబర్ : 63011 07116

విలేకరులు కావలెను
నేటి దినపత్రిక సూర్యలో కింది మండలాల్లో
పనిచేయుటకు ఉత్సాహవంతులైన,
యువకులు విలేకరులుగా కావలెను.
మడకశిర టౌన్, మడకశిర రూరల్,
గుడిబండ, రాయదుర్గం ఇన్‌చార్జ్,
రాయదుర్గం టౌన్, రాయదుర్గం రూరల్,
పుట్టపర్తి రూరల్, కొత్త చెరువు,
యల్లనూరు, పెద్దపప్పూరు, పుట్లూరు,
పెద్దవడుగూరు, యాడికి.



## రెండో రోజు శ్రీవారి హుండీ ఆదాయం లెక్కింపు..

కదిరి, మేజర్ న్యూస్ : శ్రీమద్ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని రెండవ రోజు శుక్రవారం సైతం లెక్కించారు. రూ 8,24,194 నగదు, 21 గ్రాముల బంగారం, 480 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ శ్రీనివాస రెడ్డి తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులతో పాటు ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అన్నమయ్య జయంతి వేడుకలు



ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ : పట్టణంలోని అన్నమయ్య సేవా మండలి ఆధ్వర్యంలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి ముంగిటగల అన్నమయ్య విగ్రహం వద్ద సేవా మండలి అధ్యక్షులు పోరాల్ల పుల్లయ్య వారి శిష్య బృందం ఘనంగా 616 వ జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక, విశేష పూజలను నిర్వహించారు. అనంతరం సేవా మండలి పోరాల్ల పుల్లయ్య, శిశు బృందం,విశేష పూలమాలలతో అలంకరించిన వైనం భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం పుల్లయ్య మాట్లాడుతూ అన్నమయ్య 32 వేల సంకీర్తనలు తెలుగువారికి అంకితం చేసిన మహనీయుడు అని తెలిపారు. సాక్షాత్తు కలియుగ వెంకటేశ్వరడే మానవ జీవితానికి పరమ మంత్రం అని అన్నమయ్య సంకీర్తనలు రుజువు చేశాయని తెలిపారు. ఈ జన్మదిన వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా వారం రోజులపాటు జరుగుతాయని తెలిపారు. ఇప్పటికే ప్రపంచంలో అన్నమాచార్య విశేష గుర్తింపు పొందడం జరిగిందని, కొన్నిచోట్ల అన్నమయ్య దేవాలయాలు కళ్యాణ మండపాలు, విద్యాసంస్థలు కూడా నడుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిష్య బృందం, భక్తాదులు పాల్గొన్నారు.

# ఈసీ దెబ్బకు తాడిపత్రిలో మకాం వేసిన సిట్

### – సిట్ వేటతో కొనసాగుతున్న అరెస్టులు



తాడిపత్రి మేజర్ న్యూస్ :ఏపీలో ఎన్నికల సమయంలో జరిగిన ఘర్షణలపై సిట్ వేట కొనసాగుతోంది. ఈసీ ఆదేశాలతో తాడిపత్రిలోనే సిట్ అధికారులు మకాం వేశారు. ఎన్నికల అనంతరం చోటు చేసుకున్న అల్లర్లల్లో పాల్గొన్న నిందితుల అరెస్టులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మరోసారి అల్లర్లు జరిగిన ప్రాంతానికి సిట్ అధికారుల బృందం వెళ్లనుంది. జిల్లాల్లో పోలీసులు కేసులు విచారిస్తున్న తీరుపై సిట్ మరో నివేదిక ఇచ్చే అవకాశం కూడా ఉన్నట్లు సమాచారం. కౌంటింగ్ సమయం దగ్గర పడుతుండటంతో ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 168 సమస్యాత్మక ప్రాంతాలను ఇప్పటికే గుర్తించారు. పోలింగ్ తర్వాత అల్లర్లలో పాల్గొన్న వారిపై సిట్ అధికారులు ప్రత్యేకంగా నిఘా పెట్టిందని చెప్పవచ్చు. జరిగిన అల్లర్ల ఘటనపై సిట్ బృందం కేసుల వివరాలు, నిందితుల గుర్తింపులాంటి అంశాలపై పరిశీలిస్తున్నారు. గొడవలకు గల కారణాలను పూర్తి స్థాయిలో విచారించి నివేదిక సిద్ధం చేసే పనిలో సిట్ బృందం ఉన్నట్లు సమాచారం. మరో వైపు తాడిపత్రి అల్లర్ల ఘటనలో అరెస్టులు కొనసాగుతున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డితో పాటు టీడీపీ అభ్యర్థి జేసి అస్మిత్ రెడ్డిలకు కూడా హైకోర్టులో ఊరట దక్కింది. జూన్ 6వ తేదీ వరకు అరెస్టు చేయవద్దు అంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నియోజకవర్గంలోకి వెళ్ళ వద్దంటూ కేతిరెడ్డి పెద్దారెడ్డి, జేసీ అస్మిత్ రెడ్డికి న్యాయస్థానం సూచించింది. తాడిపత్రిలో కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు సిట్ అధికారులు జిల్లాలోనే మకాం వేయనున్నారు. ఇప్పటికే 639 మంది అల్లర్లు , రాళ్లదాడిలో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే 102 మందిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. రాళ్లదాడి అల్లర్లలో పాల్గొన్న నిందితులందరూ ఇతర రాష్ట్రాల్లో తలదాచుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులను అరెస్టు చేయడానికి పోలీస్ అధికారులు చర్యలు వేగవంతం చేస్తున్నారు.అలాగే కౌంటింగ్ రోజు తాడిపత్రిలోకి బయట వ్యక్తులు ఎవరు రాకుండా పోలీస్ అధికారులు అష్టదిగ్బంధం చేయడానికి కసరత్తు చేస్తున్నారు.పట్టణంలో 144 సెక్షన్ కొనసాగుతూ ఉంది. గుంపులు గుంపులుగా ఉండొద్దంటూ ప్రజలకు పోలీసులు హెచ్చరిక చేస్తున్నారు. నలుదిక్కుల పోలీస్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి డీఐజీ షీమోన్షి, ఎస్పీ గౌతమిశాలిని ప్రత్యేకంగా నిఘా పెట్టారు.